# ముడి ఎడమైతే

-సబ్బని లక్ష్మీనారాయణ



'ఏమోయి విశ్వనాథం మా ఫ్రెండు శకుంత లొచ్చింది కాఫీ పట్రా'ఆర్డరిచ్చింది భర్తనుద్దేశించిరత్న.

ఆ...ఆ...ఒక్క నిమిషములో తెస్తా....' వంటింట్లోంచి జవాబిచ్చాడు విశ్వనాథం

రాకరాక చాలా రోజులకు వచ్చిన ఫ్రెండుశకుంతల నుద్దేశించి,

'ఏమే శకుంతలా, చాల రోజులవుతుంది కలియక, ఏంటీ విశేషాలు,మీ ఆయన బాగున్నారా పిల్లలు బాగున్నారా....' అంది రత్నం.

'ఆ....ఏముంది అంతా మామూలే, మొన్న మావారు హీరో హోండా కావాలని గును స్తుంటే, నీకెందుకు హీరోహోండా, నువ్వేమ యినా రాజ్యాలేలుతున్నావా, నౌకర్లు జేస్తున్నావా అని చిన్నిపాటిస్కూటర్ కొనిచ్చాను. ఏమిటీ మొగాళ్ళుమరీ ఇదయిపోతున్నారు, వాళ్ళను మనమంతాచంపుక తింటున్నట్టు, మొగమహారాజుల సంఘం పెట్టారు ఈమధ్య, అందులో మావారు సభ్యున్నవుతా అన్నారు, కాని నేనే వద్దన్నాను. మరి మీవారో' అంటూ ఆగింది రత్నవైపు చూస్తూ శకుంతల.

'మావారేం తక్కువ తిన్నారా, ఆయనకూడా చేరుతానన్నాడు ఆ సంఘంలో కాని నేనేవద్దన్నాను, వాళ్ళలా సంఘంలో సంభ్యులుగా చేరితే మన చెప్పు చేతుల్లో ఉంటారా, అందుకే నేను ముందు జాగ్రత్తపడ్డాను. అంటూ చెప్పడం ఆపింది రత్న.

మాటల మధ్యలో విశ్వనాథం కాఫీట్రేతో వచ్చాడు. వంటింట్లోంచి వంట పనుల్లోంచినేరుగారావడం వలన ఆయన వేషం మరీవిచిత్రంగా ఉంది. పైగా లుంగీ బనీనుమీదనే ఉన్నాడు, నెత్తికి నూనె లేక జుట్టురేగిపోయి ఉంది. వంటింటి పనులవల్ల అలసిపోయినట్లుగా కనిపిస్తున్నాడు.

కాఫీ తాగుతూ భర్తను చూస్తూ అందిరత్న, 'ఏంటయ్యా ఈవేషం, కాస్త నీటుగా ఉండచ్చుగా, చూడడానికి ఎట్లా ఉంది ఆ ముఖం తొమ్మిది అవుతుంది టైం, ఇంకా పని తెమలలే, నువ్వేం మొగుడువయ్యా, మా శకుంతలమొగున్ని చూడు ఎప్పుడు చూసినా ఎంతో ఉల్లాసంగాకనిపిస్తుంటాడు. ఎన్నయినా చెప్పు మంచి మొగుణ్ణి పొందడానికి పెట్టిపుట్టాలంటారు. నాకిట్టా దొరికావు నువ్వు, భరించక చస్తున్నాను' అంటూ భర్తను నాలుగుతిటేసింది రత్న ఫ్రెండు ముందటనే ఏమి చెయ్యాలో తోచక ఏమీ అనలేక వంటింట్లో కెళ్ళిపోయాడు విశ్వనాథం.

కొద్దిసేపటికి కలుగజేసుకొని' ఏమే రత్నా, మొన్న మొగవాళ్ళకు వంటలపోటీ అని ప్రకటించారు మహిళా సంఘంవాళ్ళు, మీ వారు పోలేదా మరి' అని అడిగింది శకుతల

'లేదే నాకు ఆలస్యంగా తెలిసింది ఆ పోటీల గురించి, లేకుంటేనేను మావారిని తప్పకుండా పంపిస్తును, మా వారు బాగానే వంట చేస్తాడులే, కాని ఉట్టి చాదస్థపు మనిషి, పనులన్నీలేటే, అసలు లేటు ఆయునకు పెట్టింది పేరు, ఈయున పనులనుచూస్తే లేటేశ్వర్‌రావు అని పేరుపెట్టవచ్చు' అంటూ చెప్పడం ఆపింది రత్న.

దానికి సమాధానంగా' మావారు కొద్దిగానయంలే, కాని షోకులెక్కువ, ఇంటిపనులు వంటపనులు అన్నీ తనే చూసుకుంటాడు చకచకా, పిల్లల పనులన్నీ కూడా తనే చూసుకుంటాడు, వంటలు మరీ బాగా చేస్తాడు, మావారికి 'నలభీమరావు' అని బిరుదియ్యవచ్చు' అని గర్వంగా చప్పింది శకుంతల.

'అయితే నువ్వు అదృష్టవంతురాలివి, మీ వారికి మహిళా మండలి తరపున 'ఉత్తముడు' అని బిరుదివ్వచ్చు. అన్నట్టు మొన్నపత్రికలో ఓ ఆర్టికల్ చూశాను, పురుషుల హక్కులు, బాధ్యతలు అంటూ తెగరాశాడు ఓ మహానుభావుడు, దానికి కౌంటర్‌గా మళ్ళీ పత్రికలలో రాశాను. దానికి మహిళల నుండి మంచి రెస్పాన్స్‌వచ్చింది'

'చాలా మంచి పనిచేశావు, అప్పుడప్పుడు నువ్వు రచనలుచేస్తావుకదా నీ కలం ఊర్కొంటుందా మరి' అని పొగడ్తగా చూసింది రత్నవైపు. శకుంతల.

కొద్దిసేపటికి 'సరేకాని' అంటూ

' మా పెద్దదానికి మొగున్నివెతకాలి, నీ ఎరుకలో మగ పిల్లలుంటే చూసిపెట్టవే' అంది రత్న

'మరి అబ్బాయి గుణగణాలు ఎలా ఉండా లంటావు' అడిగింది శకుంతల

'అబ్బాయి నలుపుగా ఉండకూడదు, చామనచాయ ఉన్నా పరవాలేదు,చక్కదనంగా ఉండాలి ముఖం, ఎరుపైతే ప్రిఫరెన్స్, డిగ్రీ దాక చదివి ఉండాలి. ఉద్యోగంచేసినాచెయ్యకున్నా పరవాలేదు, ఎలాగు మాఅమ్మాయి ఉద్యోగం చేస్తుంది కనుక. ఇక వంటపని, ఇంటిపని వచ్చి తీరాలి. అణకువ, ఓర్పు, సహనం ఉంటే మంచిది.' పూసగుచ్చినట్లు చెప్పింది రత్న.

'మరి కట్నకానుకల విశేషాలో'

మా అమ్మాయికేం వజ్రం, పైగా ఉద్యోగం చేస్తుంది. ఓ అయిదు లక్షలన్నా కట్నం ఇవ్వాల్సిందే, ఇంకా లాంచనాలన్ని ముట్టజెప్పాలి'

'అన్ని లక్షలంటే మరీ కష్టమేమో'

'మరీ మగపిల్లలున్న తలిదండ్రుల పరిస్థితి ఘోరంగా ఉంది కాస్తఆలోచించాలినువ్వు'

'కో అంటే కోటి మందివచ్చి పిలగాన్నివ్వడానికి సిద్ధంగా ఉన్నారు మా అమ్మాయికి, పెద్ద బంగళా, ఆస్తి, బంగారం, ఉద్యోగం ఏమి తక్కువవుంది, అబ్బాయికి ఏమి కష్టాలుంటాయి, ఇంటిపని చేతకాకపోతే పని మనుషులనుపెట్టుకోవచ్చు, ఎంతచెట్టుకు అంతేగాలి, ఏదయినా మంచి సంబంధం ఉంటే చెప్పు వచ్చే ఎండాకాలం పెండ్లిచేద్దాం' అంది రత్నం

'సరే మంచిది ఇక నేను వెళ్తా' అంటూ లేచి నడుస్తూ

'ఇంకో గంటకు ఓ మీటింగుకు వెళ్ళాలె నేను మా ఆయన, మీరు వస్తారా' అంటూ ఆగింది కాసేపు శకుంతల

'ఏం మీటింగు' తెలుసుకోవాలని అడిగింది రత్న.

'ఇవ్వాళ పన్నెండు గంటలకు 'మొగుడే కావాలా'అనే పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఉంది, నువ్వు వస్తే మీ ఆయనను తీసుకొనిరా, మీటింగు అయిపోయిన తరువాత భారత్ టాకీసులో 'ఆడపులి' సినిమా చూసి వస్తాం మ్యాట్నీషో' అంది శకుంతల

'సరే అలానే' అంది రత్న

'మరి లేటు చెయ్యద్దు' అంటూ అక్కడినుండి కదిలింది శకుంతల

'నాదేంలేటుంది అంతా మావారిదే లేటు... ఏమోయి విశ్వనాథం తొందరగా రడీకా' అంటూ భర్తను పురమాయించింది రత్న. ★